క్లుప్తంగా

పండ్ల తోటల పరిశీలన



పండ్లతోటలను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటరత్నం

పుట్లూరు: మండలంలో ఉపాధి హామీ కింద సాగు చేస్తున్న పండ్ల తోటలను గురువారం ఏపీడీఓ వెంకటరత్నం పరిశీలించారు. చింత కుంట, కందికాపుల, పుట్లూరు గ్రామాల్లో పండ్ల తోటలను పరిశీలించిన అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. బిల్లులు సక్రమంగా అందుతున్నాయా అనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ మునేంద్ర ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

గుంతకల్లు రూరల్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. తిమ్మాపురం, వైటీ.చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో 6వ నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. దాదాపు రూ.20వేల వ్యయంతో రూపొందించిన ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని క్లబ్ సభ్యులు తెలిపారు.

జిమ్ పరికరాలు ఏర్పాటు చేయించండి



పార్క్‌లో జిమ్ పరికరాల ఏర్పాటుపై చర్చిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 1వ వార్డు విజయనగర్ కాలనీపార్క్‌లో జిమ్ పరికరాలు ఏర్పాటు చేయించడంతో పాటు మొక్కలు నాటించాలని కమిషనర్ మల్లికార్జున ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం కమిషనర్ కౌన్సిలర్ ప్రభాకర్, అధికారులతో కలిసి పార్క్‌ను పరిశీలించారు. పార్క్‌లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. అనంతరం కమిషనర్ 30వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కథలగేరి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులపై స్థానికులతో చర్చించి తగు చర్యలు చేపడుతామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, డీఈ హేమచంద్ర, ఏఈ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ మేనేజర్‌కు సన్మానం



మేనేజర్ దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

శింగనమల: తరిమెలలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) మేనేజర్ దుర్గాప్రసాద్ అనంతపురానికి బదిలీ కావడంతో గురువారం సిబ్బంది ఆయన్ను సన్మానించారు. నూతన మేనేజర్ మురళీ దుర్గాప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది గిరిరెడ్డి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల వితరణ



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

యాడికి: నగరూరు ఉన్నత పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 158 మంది విద్యార్థులకు తాడిపత్రి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సెక్రటరీ సుబ్రమణ్యం, సభ్యులు గురువారం ప్లేట్లు గ్లాసులు అందించారు. రెండు నెలల క్రితం పాఠశాలలో పాముకాటుకు గురైన విద్యార్థిని వెంటనే తన బైక్‌పై తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించిన పీఈటీ మహబూబ్ బాషాను రోటరీ క్లబ్ అధ్యక్షుడు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కుళ్లాయప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రయాన్‌-3 సక్సెస్‌పై హర్షాతిరేకాలు



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తదితరులు



ఇస్రో అక్షర క్రమంలో కూర్చుని అభినందలు తెలియజేస్తున్న గుంతకల్లులోని రోటరీ స్కూల్ విద్యార్థులు



గుత్తి: ర్యాలీ నిర్వహిస్తున్న కోట ఉన్నత పాఠశాల విద్యార్థులు

గుంతకల్లుటౌన్: చంద్రయాన్‌-3 ప్రయోగం విజయవంతం కావడంతో పట్టణంలో హర్షాతిరేకాలు మిన్నంటాయి. జయహో..భారత్, ఇస్రో జిందాబాద్ నినాదాలతో పురవీధులు హోరెత్తాయి. గురువారం మున్సిపల్ కౌన్సిల్, అధికారులు, సిబ్బంది కూడా మున్సిపల్ కార్యాలయంలో విజయోత్సవం జరుపుకున్నారు. అనంతరం జాతీయ జెండాలను చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మల్లికార్జున కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. చైర్‌పర్సన్ ఎన్.భవాని వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రపంచ అంతరిక్ష యవనికపై ఇస్రో భారతకీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగిరేసి సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి సాధ్యం కాని విధంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టి జయహో భారత్ అనేలా చేసిందన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీహైస్కూల్ విద్యార్థుల భారీ ర్యాలీ..

రోటరీ హైస్కూల్ విద్యార్థులు చంద్రయాన్‌-3, విక్రమ్ ల్యాండర్ నమూనాల ప్రదర్శనతో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతపట్టుకుని భారత్..ఇస్రోకు జేజేలు పలికారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద, రోటరీహైస్కూల్ కరస్పాండెంట్ వీఎల్.గుప్త, మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రేణుక, వరలక్ష్మి, పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుత్తి: చంద్రయాన్‌-3 విజయవంతంపై గుత్తి, గుత్తి ఆర్ఎస్‌తో పాటు చెట్నేపల్లిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం సంబరాలు నిర్వహించారు. గుత్తిలోని పద్మవాణి ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చంద్రయాన్‌-3 నమూనాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పద్మవాణి పాఠశాల వద్ద విజయోత్సవ ర్యాలీని సీఐ వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. కోట ఉన్నత పాఠశాల విద్యార్థులు, చెట్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోట ఉన్నత పాఠశాల హెచ్ఎం సుభహాన్, చెట్నేపల్లి పాఠశాల హెచ్ఎం జయరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలో గురువారం సాయంత్రం చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో చంద్రయాన్‌-3 శకటంతో విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి జయహో భారత్ అనే నినాదాలతో హోరెత్తించారు. స్కూల్ సీఈఓ సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, జోజోడే కుమార్, లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన అవసరం



రైతులకు మందులను అందిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: పశువ్యాధులపై రైతులకు అవగాహన అవసరమని పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. గురువారం కేవీకే ఆధ్వర్యంలో నార్పల మండలం సిద్దరాచెర్లలో పశువ్యాధులు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ పశువుల పెంపకం, వాటిలో వచ్చే వ్యాధులు, నివారణ మార్గాలను తెలియజేశారు. అనంతరం పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. రైతులకు ఉచితంగా పశువుల మందులను అందజేశారు. కేవీకే పశు వైద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, డాక్టర్ రాధిక, డాక్టర్ వినోద్, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదలకు అందిస్తున్న ఉచిత రేషన్‌ను లబ్ధిదారులకు సక్రమంగా అందాలని ఎంపీపీ గండ్లపాటి విశాలాక్షి, తహసీల్దార్ మహబూబ్ బాషా సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీపీని ఆహార సలహా కమిటీ కో–చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా నిత్యావసరాలను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు రేషన్ సరఫరాపై సిబ్బంది, ఉపాధ్యాయులతో చర్చించారు. సీఎస్‌డీటీ సూర్యనారాయణ, డీటీ లలిత, ఎంఈఓ మనోహర్, కౌన్సిలర్లు నజీర్, వరదరాజులు, ఎంపీటీసీ చిన్న వీరన్నగౌడ్, డీలర్లు, గ్యాస్ ఏజెన్సీలు, ఉపాధ్యాయులు శ్రీధర్‌గౌడ్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పామిడి: లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ పాయింట్ నుంచి ఎఫ్‌పీ షాపు డీలర్‌కు రేషన్ కోటాను సక్రమంగా కేటాయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జోజోడే కుమార్, సచివాలయాల రూరల్ కన్వీనర్ ఎం కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి, సీఎస్‌డీటీ శ్రీరాములు, స్టాకిస్టు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్ల విడుదల



మంజునాథ్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక అయ్యవారుపల్లి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఇంటికి చేరుకొని ఆయన అల్లుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డికి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను అనంతపురం ఎంపీ తలారి రంగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గోకుల్ నాథ్‌రెడ్డి, త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఊబిచెర్ల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రామచంద్ర, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సైన్స్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కృష్ణకుమారి గురువారం తెలిపారు. మొత్తం రెండు విభాగాలకు గాను ఇంటర్వ్యూ నిర్వహించినట్లు తెలిపారు. జువాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ క్వాలిఫై అయిన విద్యార్థులు లేకపోతే ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్‌సీ, కంప్యూటర్ అప్లికేషన్స్ పూర్తయిన వారు కూడా అర్హులన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతాలు

అనంతపురం కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో అనంత, సత్యసాయి జిల్లాల్లో ఒక ఆలయం చొప్పున సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ సహాయకులు బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం సోమందేపల్లి మండల కేంద్రంలోని శివానగర్‌లోని శివాలయంలో, శింగనమల మండలం గుమ్మేపల్లిలోని సీతారామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాల తరపున వరమాలక్ష్మీ వ్రతాలు జరుగుతాయన్నారు.

ఐచర్ వాహనం బోల్తా



బోల్తా పడిన ఐచర్ వాహనం

పామిడి: పొగరూరు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐచర్ వాహనం బోల్తా పడింది. ఢిల్లీ నుంచి ఐచర్ వాహనం బెంగళూరుకు బయలుదేరింది. పొగరూరు వద్ద డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేకపోవడంతో వాహనం వంతెనపై రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. డ్రైవర్ రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

బాలుడికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు: కండ్లగూడూరు గ్రామంలో గురువారం లోక్ నాథ్ అనే బాలుడిపై కాఫీ పడి తీవ్రంగా గాయపడ్డాడు. లోక్‌నాథ్ తల్లి కాఫీ కాంచి కిందకు దించుతుండగా ప్రమాదవశాత్తు బాలుడిపై. తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం తీసుకెళ్లారు.

ప్రజా సంక్షేమయాత్రకు విశేష స్పందన



తిప్పారెడ్డిపల్లెకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పైలా నరసింహయ్య

యాడికి: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండలంలో చేపట్టిన నాలుగో విడత ప్రజా సంక్షేమ యాత్రకు విశేష స్పందన లభించింది. గురువారం నిట్టూరు గ్రామం నుంచి 3వ రోజు పాదయాత్ర ప్రారంభమైంది. నిట్టూరు నుంచి తిరునాంపల్లె మధ్యలో దారి పొడవునా వాహనదారులు వాహనాలను ఆపి పాదయాత్రకు సంఘీభావం తెలిపి ఎమ్మెల్యేతో కలిసి అడుగులు వేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగితే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారని తెలియజేశారు. తిరునాంపల్లెకు చేరుకోగానే గ్రామ వైఎస్సార్ సీపీ నేత రాజారెడ్డి, మహిళలు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర తిరునాంపల్లె నుంచి తిప్పారెడ్డి పల్లెకు పోయే పొలాల దారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సంక్షేమయాత్రలో పాల్గొని ఎమ్మెల్యేకు సంఘీభావం తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు. పొలాల వెంబడి సాగుతున్న యాత్ర వద్దకు ఓ రైతు వచ్చి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వర్షాలు సక్రమంగా కురుస్తున్నాయని,దీనికి తోడు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నేరుగా తన బ్యాంకు ఖాతాలో జమవుతుందని, గతేడాది నష్ట పరిహారం వచ్చిందని తెలియజేశారు. యాత్ర తిప్పారెడ్డిపల్లె వద్ద పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి, యాడికి మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చిఎమ్మెల్యే స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనేయులు ఏర్పాటు చేసిన అల్పాహారంలో పాల్గొన్న అనంతరం కొట్టాల పల్లెకు యాత్ర సాగింది. గ్రామస్తులు హారతితో స్వాగతం పలికి ఎమ్మెల్యేపై పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. పురవీధుల్లో సాగుతున్న యాత్ర వద్దకు ఓ వృద్ధురాలు ఆప్యాయంగా వచ్చి జగనన్న ప్రభుత్వం వచ్చిన త్వాతనే నెలనెలా 1వ తేదీనే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఫించన్లు అందిస్తున్నారని, ఏదైనా జబ్బు వస్తే గ్రామంలో ఉన్న వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యేతో వివరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన వారికి సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా అందిస్తున్నామన్నారు. ప్రజలు బాగా ఆలోచించి అభివృద్ధి చేసే నాయకులనే ఎన్నుకోవాలని సూచించారు. జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రంగనాథరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, యాడికి సర్పంచు, ఉప సర్పంచులు అనురాధ, కాసా చంద్రమోహన్, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులురెడ్డి, జయకృష్ణ, రాజారెడ్డి, ఉమ్మడి రామాంజులరెడ్డి, హేమంత్ రెడ్డి, విద్యానందరెడ్డి, నాగాంజనేయులు, కొమ్ము ప్రసాద్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం

బెంగళూరులో స్థిరపడిన యాడికి గ్రామానికి చెందిన రాచమల్లు నాగలింగేశ్వర రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు దాదాపు 4 లక్షలతో తిప్పారెడ్డిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత శుద్ధజల కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. తాగు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు.

దాడి ఘటన అవాస్తవం

తాడిపత్రి: రెవెన్యూ అధికారిపై వైఎస్సార్‌సీపీ నేత దాడి చేసినట్లు రెండు రోజుల క్రితం ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనం అవాస్తవమని తహసీల్దార్ మునివేలు గురువారం తెలిపారు. సదరు పత్రికలో వచ్చిన కథనంపై సాక్షి ప్రతినిధి ఫోన్‌లో తహసీల్దార్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, ఇలా ఎందుకు రాశారో వారి ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. తాడిపత్రి రెవెన్యూ కార్యాలయంలోని ఏ చిన్నస్థాయి ఉద్యోగిపై కానీ, అధికారిపై ఎలాంటి దాడి జరగలేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు. విధి నిర్వహణలో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులపై ఇలా లేనిపోని కథనాలు రాయడం వల్ల జరిగే మేలు ఏమిటో తనకు తెలియదన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: బేతాపల్లిలో అనారోగ్య సమస్యలతో ఓ వృద్ధుడు గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జయరాములు కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. తీవ్ర మనస్థాపానికి గురైన వృద్ధుడు తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



గాయపడిన పుల్లమ్మను 108 వాహనం నుంచి ఆసుపత్రిలోకి తీసుకెళ్తున్న దృశ్యం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెరువు తండా శివారులో గుత్తి–పత్తికొండ మార్గంపై గురువారం ఆటో అదుపు తప్పి బోల్తాపడి ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంకు చెందిన పుల్లమ్మ, శ్రీదేవి, భారతమ్మ, కోటేశ్వరమ్మ, వెంకటరత్నమ్మ, దుర్గాప్రసాద్ గుత్తిలో ఉంటూ కర్నూలు జిల్లా జొన్నగిరి చుట్టూ ఉన్న పల్లెల్లో ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గురువారం వేకువజామున గుత్తి నుంచి ఆటోలో జొన్నగిరికి వెళ్తుండగా చెరువు తండా గ్రామ శివారులో మలుపులో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి పంటపొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో పుల్లమ్మ, శ్రీదేవి తీవ్రంగా గాయపడ్డారు.భారతమ్మ, కోటేశ్వరమ్మ, వెంకటరత్నమ్మ, దుర్గా ప్రసాద్ స్వల్పంగా గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు పుల్లమ్మ, శ్రీదేవిని అనంతపురం తీసుకెళ్లారు. జొన్నగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి



సిబ్బందితో కలిసి కవాతు చేస్తున్న డీఎస్పీ నరసింగప్ప

పామిడి: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ నరసింగప్ప కోరారు. గురువారం సాయంత్రం ఆయన ఇన్‌చార్జ్ సీఐ షేక్ చాంద్‌బాషా, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి స్థానిక బీసీసీ రోడ్డుపై కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు నడపడానికి ఇవ్వరాదన్నారు. అలా ఇస్తే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఆటోడ్రైవర్లు తప్పక యూనిఫామ్ ధరించాలన్నారు. ఏఎస్ఐ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నరహరి తీర్థస్వామి ఆరాధన



శ్రీనరహరి తీర్థస్వామికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తిలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ తండ్రి నరహరి తీర్థ స్వామీజీ ఆరాధన, శివరూప దత్తాత్రేయ స్వామి జయంతి గురువారం వైభవంగా జరిగింది. ఈ ఆరాధన మహోత్సవాలను మైసూరు నుంచి వచ్చిన పురోహితుల ఆధ్వర్యంలో నరహరితీర్థస్వామికి రుద్రహోమం, మహన్యాస పూర్వక ఏకదాశ రుద్రాభిషేకం, దత్రాత్రేయస్వామి తైలాభిషేకం, దత్తహోమం, స్వామికి ఆరాధన మహోత్సవం జరిపించారు. స్వామిజీ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ దానగుణం అలవర్చుకోవాలన్నారు. సుఖ, దుఃఖాలు మానవుడికి సామాన్యంగా వచ్చేవని, వాటిని సహనంతో ఎదుర్కొనేవారే జ్ఞానవంతులన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నుంచే కాక యితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో భక్తజన సందోహంతో ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం స్వామిజీ పూజలకు హాజరైన భక్తులకు రాగి ముద్దను తన చేతులతో ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం జరిగింది.

పిల్ల కాలవలు ఏర్పాటు చేయండి

గుంతకల్లు: గుంతకల్లు, వజ్రకరూరు మండలాల్లోని గ్రామాలకు పిల్ల కాలవలు ఏర్పాటు చేసి రాగులపాడు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈనెల 22న వజ్రకరూరు మండలం రాగులపాడు ఎత్తిపోతల పథకం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గురువారం గుంతకల్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బీరప్ప గుడి సర్కిల్ వద్ద సీపీఎం పార్టీ నాయకులు పాదయాత్రకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా కసాపురం రోడ్‌లోని ఆర్డీఓ కార్యాలయం వరకు సాగింది. అక్కడ ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అంతరం ఆర్డీఓ రవీంద్రకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, సాకే నాగరాజు, విరుపాక్షి, రంగారెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

గుత్తికి చేరిన ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర

గుత్తి: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నాయకులు తాడిపత్రిలో బుధవారం ప్రారంభించిన సైకిల్ యాత్ర గురువారం గుత్తికి చేరింది. స్థానిక గాంధీ సర్కిల్ వద్ద ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సైకిల్ యాత్రకు స్వాగతం పలికారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ , సీనియర్ నాయకులు శివ, గిరి, సిద్దప్ప, నరసింహారెడ్డి, రజిత, శివా నాయక్ పాల్గొన్నారు.